సాక్షి పెద్దపల్లి

బుధవారం : 8 : మే : 2024

I



సీతారాముల పట్టాభిషేకం

జూలపల్లి : వడ్కాపూర్‌లో మూడురోజులుగా చిడతల రామాయణం నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీసీతారాముల పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు.



రైలు పట్టాలపై తగ్గిన వేడి

రామగుండం: అకాల వర్షంతో రైల్వేపట్టాలపై ఉష్ణోగ్రతలు సుమారు 10 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గాయని, తద్వారా వేడి గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.1/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం



జస్టిస్ ఘోష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

జ్యోతినగర్(రామగుండం): జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికా రు. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకున్న జస్టిస్ ఘోష్‌కు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఘనస్వాగతం పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తునకు ఏర్పాటైన జ్యుడీషియల్ కమిషన్‌కు రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ చైర్మన్‌గా నియమితులైన విషయం విదితమే. ఈక్రమంలో ఆయన మేడిగడ్డ బ్యారేజీ సందర్శించారు. అనంతరం ఎన్టీపీసీ జ్యోతిభవన్‌కు చేరుకున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు నేడే ఆఖరు



ఓటువేసిన గంగయ్య

పెద్దపల్లిరూరల్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు బుధవారం వరకు గడువు ఉందని పెద్దపల్లి సహాయ ఎన్నికల అధికారి, ఆర్డీవో గంగయ్య తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో మంగళవారం గంగయ్య పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల సిబ్బంది తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

ఎలిగేడు(పెద్దపల్లి): సుల్తాన్‌పూర్, ఎలిగేడులో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత మంగళవారం పర్యటించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయండి

ఎలిగేడు(పెద్దపల్లి): ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి కోరారు. ముప్పిరితోటలో పెద్దపల్లి ఉద్యానవనశాఖ, రివులిస్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. త్వరలోనే పెద్దరాతిపల్లిలో ఆయిల్‌పామ్ శుద్ధి పరిశ్రమ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఏఈవో పద్మ, ఫీల్డ్‌ఆఫీసర్ అభిలాష, రివులిస్ డ్రిప్ ఇరిగేషన్ ప్రతినిధి రహమాన్, కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో 6.10టీఎంసీలు

రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు. నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 141 మీటర్లు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 6.10 టీఎంసీలకు పడిపోయింది.

చిన్నారుల విహారయాత్ర



యాత్రకు బయలుదేరుతున్న చిన్నారులు

రామగుండం: స్థానిక తబితా ఆశ్రమంలోని చిన్నారులు వేసవి ఆటవిడుపు కోసం మంగళవారం హైదరాబాద్‌లోని వండర్‌లా సందర్శనకు బయలుదేరి వెళ్లారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తన సొంత నిధులు వెచ్చించడంతో చిన్నారు మానసిక ఆనందం కోసం విహార యాత్రకు తీసుకెళ్తున్నామని ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

ప్రవేశ పరీక్ష ప్రారంభం

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూలో మంగళవారం ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష ప్రారంభమైంది. ఈనెల 11వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. తొలిరోజు ఉదయం పరీక్షకు 100 మందికి 91 మంది, మధ్యాహ్నం 100 మందికి 94 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను తనిఖీ చేశాక పరీక్షహాల్‌లోకి అనుమతించామని పేర్కొన్నారు.

అకాలం.. అతలాకుతలం

మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచే ఎండలు దంచికొట్టాయి. ఉక్కపోతతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులు జనాలను భయకంపితులను చేశాయి. మరోవైపు.. వర్షం, గాలుల ధాటికి కోతకు వచ్చిన వరి పైరు నేలవాలింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొనుగోలు కేంద్రాల్లో తూకానికి సిద్ధంగా ఉంచిన వడ్లు వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి. చేతికి వచ్చిన పంటను వానదేవుడు హఠాత్తుగా తన్నుకుపోవడంతో అన్నదాత కన్నీరుమున్నీరయ్యాడు.

– సాక్షి, పెద్దపల్లి

- బలమైన ఈదురుగాలులు
- ఆ వెంటనే ఉరుములు, మెరుపులు
- మధ్యాహ్నం దంచికొట్టిన అకాల వర్షం
- తడిసి ముద్దయిన ధాన్యం.. రాలిన మామిడికాయలు
- ధ్వంసమైన ఇళ్ల పైకప్పులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



ధర్మారం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపునీరు, తడిసిన ధాన్యం

ధర్మారంలో..

ధర్మారం(ధర్మపురి): బంజేరుపల్లి, పెర్కపల్లి, కటికెనపల్లి, మల్లాపూర్, ఎర్రగుంటపల్లిలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5గంటల వరకు వడగళ్లవాన కురిసింది. మామిడి కాయలు నేలరాలాయి. ధర్మారం, ఎర్రగుంటపల్లి, కటికెనపల్లిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఎర్రగుంటపల్లిలో ధాన్యం కుప్పలు నీట మునిగిపోయాయి. తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిపోయాయి. సరిపడా టార్పిలిన్లు ఇవ్వకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని రైతులు వాపోయారు.

ధాన్యం కొట్టుకుపోయింది



ధర్మారం కేంద్రంలో పోసిన దాదాపు 3 క్వింటాళ్ల ధాన్యం నీటిలో కొట్టుకపోయింది. వర్షం తగ్గిన తర్వత మిగిలిన ధాన్యంపై కవర్లు కప్పిన. సరిపడా టార్పాలిన్లు ఇవ్వకపోవడంతోనే ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది.

– గుమ్ముల సతీశ్, రైతు, ధర్మారం

జిల్లాలోని ధర్మారం, ఎలిగేడు, పెద్దపల్లి, రామగిరి, మంథని, ముత్తారం, ఓదెల మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయ్యింది. ఆరబెట్టిన ధాన్యంతోపాటు తూకం వేసిన వడ్ల బస్తాలు వర్షపునీటిలో తడిశాయి. కొన్నిచోట్ల నీటిలో కొట్టుకుపోయాయి. ఎలిగేడు, ధర్మారం మండలాల్లో మామాడికాయలు రాళ్లవర్షం ధాటికి నేలరాలాయి.

సౌకర్యాలు కరువు..

గ్రామాల్లో ఎక్కడికక్కడే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మార్కెట్ యార్డులతోపాటు, గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడ సౌకర్యాలేమీలేవు. ధాన్యం కుప్పలు పోసుకున్న రైతులకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవు. మంగళవారం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం తడిసిముద్దయ్యింది. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోవడాన్ని చూసిన రైతులు కన్నీరుమున్నీరయ్యారు. వడ్లను కాపాడుకునేందుకు కొనుగోలు కేంద్రాలకు ఉరుకులు, పరుగులు తీశారు.

ఐదురోజుల పాటు భారీవర్షాలు

రాష్ట్రంలో మరో 5 రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం ఉరుములు, మెరుపులు, గంటకు 40 కి.మీ. నుంచి 50కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. భారీవర్షాలు కురుస్తాయని, దీంతో జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

జూలపల్లిలో వర్షం..

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొంత వర్షపునీటిలో కొట్టుకుపోయింది. రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్‌లోని గ్రామాల్లో కురిసిన భారీవర్షం, గాలిదుమారానికి ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. చేతికి చేతికి అందివచ్చిన వరి పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు ఆవేదన చెందారు.

ఎలిగేడులో..

ఎలిగేడు(పెద్దపల్లి): కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. లాలపల్లిలో వడగళ్లవాన కురిసింది. వరిపైరు నేలవాలింది. అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. మామిడికాయలు రాలిపడ్డాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి.

జిల్లా సమాచారం	
కొనుగోలు కేంద్రాలు	311
సేకరించిన ధాన్యం(మెట్రిక్ టన్నుల్లో)	1,52,179
మిల్లులకు తరలించింది(మెట్రిక్ టన్నుల్లో)	1,50,908
కేంద్రాల్లో ఉన్న ధాన్యం(మెట్రిక్ టన్నుల్లో)	1,271

గ్రామాల్లో..

సుల్తానాబాద్‌రూరల్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కురిసిన భారీవర్షానికి ధాన్యం తడిసిపోయింది. నీటిలో కొట్టుకుపోయిన వడ్లను కాపాడుకునేందుకు అన్నదాతలు నానాఅవస్థలు పడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

ముత్తారంలో..

ముత్తారం(మంథని): మచ్చుపేటకు చెందిన కలవేన మల్లయ్య ఇంటి పైకప్పు రేకులు గాలిదుమారం ధాటికి కొట్టుకుపోయాయి. సమీపంలోని విద్యుత్ స్తంభానికి తగిలి ఆగాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లక్కారం, మచ్చుపేట, మైదంబండ, సర్వారం, కేశనపల్లి, పారుపల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడ్‌లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. అకాల వర్షం తమను ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఓదెలలో..

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, గుంపుల ఐకేపీ కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొంత వర్షపునీటిలో కొట్టుకుపోయింది. కొలనూర్‌లో జక్కుల రాజయ్యకు చెందిన ఇంటి పైకప్పు గాలిదుమారానికి కొట్టుకుపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఓదెల, పొత్కపల్లిలోనూ కొన్ని ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి(రామగుండం): వివిధ గ్రామాల్లో మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన వర్షంతో కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొనుగోలు కేంద్రాల్లో తూకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు పాక్షికంగా తడిశాయి.

వడగళ్లవాన – విరిగిన చెట్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షం కురిసింది. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యంపై పరదాలు కప్పేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది అప్రమత్తమై వెంటనే టార్పాలిన్లు కప్పడంతో ధాన్యం తడవలేదు. నిట్టూరు, మారేడుగొండ తదితర గ్రామాల్లోనూ వర్షం కురిసింది. నిట్టూరులోని శ్మశానవాటిక పైకప్పు గాలి ధాటికి ఎగిరి పడింది. తాటిచెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. రాఘవపూర్, రాగినేడు, ములసాల, కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట, సుల్తానాబాద్ మండలం కనుకులలోని సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ఎస్ఈ సుదర్శనం తెలిపారు. సమస్యలు ఉంటే 79016 28367 నంబరుకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

తడిసిన ధాన్యం పరిశీలన

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సందర్శించారు. తడిసిన ధాన్యంపై ఆరా తీశారు. వర్షం కురిసేలోపు టార్పాలిన్లు కప్పడంతో పెద్దగా తడవలేదని అధికారులు ఆయనకు వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. పాక్షికంగా తడిసిన ధాన్యాన్ని ఆరబోయించి కొనుగోలు చేయాలన్నారు. మార్కెట్ కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, సీఈవో మదన్‌మోహన్ ఉన్నారు.

వడ్లు.. నీటిపాలు..

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక వ్యవసాయ మార్కె ట్‌లో ఆరబోసిన ధాన్యం వర్షపునీటికి తడిసి ముద్దయ్యింది. ఇటుక బట్టీలకు తీరని నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి పరిశీలించారు.



పెద్దపల్లి మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



జూలపల్లి : వడ్లకుప్పపై కవర్లు కప్పుతున్న రైతులు



ఎలిగేడు : లాలపల్లిలో కురుస్తున్న రాళ్లవాన



ముత్తారం : మచ్చుపేటలో ధ్వంసమైన రేకులు



కాల్వశ్రీరాంపూర్ : కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



సుల్తానాబాద్ రూరల్: వడ్లకుప్పలోంచి వర్షపునీరు తొలగిస్తున్న రైతులు



పెద్దపల్లి మార్కెట్‌లో ధాన్యం తడవకుండా కుప్పలపై కవర్లు కప్పుతున్న అధికారులు



ఓదెల : కొలనూర్‌లోని కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు తొలగిస్తున్న రైతు



ఓదెల : కొలనూర్‌లో గాలిదుమారం ధాటికి కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు రేకులు



పెద్దపల్లిరూరల్ : నిట్టూరులో విరిగిపడ్డ తాటిచెట్టు

ప్రకృతి కన్నెర్ర

- గాలిదుమారంతో కుప్పకూలిన వేదిక
- ముఖ్య అతిథి చేరకముందే ఘటన
- బీజేపీ శ్రేణుల్లో నిరుత్సాహం



సీఎం రాకముందే కుప్పకూలిన సభావేదిక

మంథని: పార్లమెంట్ ఎన్నికల వేళ.. క్యాడర్‌లో జోష్ నింపి, ఓటర్లలో ఉనికి చాటుకునేందుకు భారతీయ జనతా పార్టీ పట్టణంలో మంగళవారం చేపట్టిన బహిరంగసభపై ప్రకృతి కన్నెర్ర జేసింది. కొద్ది రోజులుగా మంథనిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే, వాతావరణంలో మంగళవారం ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై చల్లబడింది. ఇది తమకు శుభసూచకమని బీజేపీ క్యాడర్ ఆనందం వ్యక్తచేసింది. సరిగ్గా ఇదే సమయంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

భారీగా జనసమీకరణ..

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యే బహిరంగ సభ ఉదయం 9గంటలకు ఉంటుందని బీజేపీ శ్రేణులు ప్రచారం చేశారు. ఈమేరకు పెద్దసంఖ్యలో జనాన్ని తరలించారు. కానీ, నిర్దేశిత సమయం కన్నా సుమారు ఐదు గంటలు ఆలస్యమైంది. దీంతో పలువురు వేదికపైనుంచి మాట్లాడుతూ, సభికులను ఉత్సాహ పరిచారు. ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఓవైపు మాట్లాడుతుండగానే జనం సభ నుంచి వెళ్లిపోవడం కనిపించింది. ఆ తర్వాత మెల్లిగా గాలిదుమారం ప్రారంభమైంది. ఆ వెంటనే బీభత్సం సృష్టించింది. వేదిక వద్ద టెంట్లు గాలిదుమారం ధాటికి కుప్పకూలిపోయారు. తొలుత జనం కోసం వేసిన టెంట్లు, ఆ తర్వాత స్టేజీ వేసిన టెంట్లు, వేదిక నెలమట్టమైంది.

తప్పిన పెనుప్రమాదం

ఈదురుగాలులకు వేదిక ఒక్కసారిగా కుప్పకూలింది. టెంట్లకింద ఉన్న ప్రజలు పరుగులు తీశారు. మరికొందరు టెంట్లకు అవల ఉండడంతో ప్రమాదం తప్పింది. అయితే, ఈ ఘటనలో ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. ఏదిఏమైనా బహిరంగ సభ ద్వారా తమ ప్రభావం చాటేందుకు బీజేపీ చేసిన ప్రయత్నంపై ప్రకృతి కన్నెర్ర జేయడంతో ఆ పార్టీ శ్రేణులు నిరాశ చెందారు.

అన్నదాతలంటే బీజేపీకి అక్కసు ఎందుకు?

- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు అంటే బీజేపీకి అక్కసు ఎందుకని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డుగా పెట్టుకొని బీజేపీ, బీఆర్ఎస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన సొమ్మును నిలిపివేయడం సరికాదన్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్నికల రోజు రైతుబంధు సొమ్ము జమచేస్తే ఆనాడు నోరు మెదపని బీజేపీ.. నేడు రైతుబంధు డబ్బు ఎందుకు ఆపిందని నిలదీశారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలపై రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మకు అవగాహన లేదని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రను బీజేపీ చేస్తుందనేనిది నిజం కాదా? అని ప్రశ్నించారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ, టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు పురుశోత్తంరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి మరిన్ని పథకాలు



వాకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టేలా చూస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా ప్రాంగణంలో మంగళవారం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దివంగత నేత వెంకటస్వామి(కాకా) మనుమడు, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ చేతిగుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల తర్వాత రూ.36 కోట్లతో లక్ష్మీనగర్ ప్రాంత అభివృద్ధి ప్రారంభిస్తామని, రూ.15 కోట్లతో స్టేడియం అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, ముస్తాఫా తదితరులు ఉన్నారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి(రామగుండం): కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. కొత్తపల్లి, ఈసాలతక్కళ్లపల్లిలో ఉపాధిహామీ కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నాయకులు సూర సమ్మయ్య, గంగాధర రమేశ్, ముక్కెర శ్రీనివాస్, పాత రవీందర్, మహేందర్, ఒడ్నాల రాజు పాల్గొన్నారు.

బీ థర్మల్‌లో ఉత్పత్తి నిలిపివేత

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో మంగళవారం ఉత్పత్తి నిలిపివేశారు. హైదరాబాద్ విద్యుత్ సౌధ నుంచి ఆదేశాలు రావడంతో ఇంజినీర్లు విద్యుత్ కేంద్రాన్ని ట్రిప్ చేశారు. వ్యవసాయ వినియోగం తగ్గడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో విద్యుత్ వినియోగం తగ్గిందని అధికారులు తెలిపారు.

గడువు తీరిన మందులపై విచారణ

సాక్షి స్పందన



విచారణ జరుపుతున్న ఆర్ఎంవోలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఓ పేషెంట్‌కు గడువు ముగిసిన మందులు ఇచ్చిన ఘటనపై మంగళవారం 'సాక్షి'లో 'సర్కారు ఆస్పత్రిలో గడువు ముగిసిన మందులు!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఆస్పత్రి కొత్త బ్లాక్‌లోని ఫార్మసీ కేంద్రంలో ఆర్ఎంవోలు తిరుమలేశ, రేణుక తనిఖీ చేశారు. పేషెంట్‌కు ఇచ్చిన మందుల గడువు తేదీలు పరిశీలించారు. గడువు ముగిన మందులను ఫార్మసీ విభాగం ఇన్‌చార్జిలకు అప్పగించాలని ఆదేశించారు. ఆర్ఎంవో తిరుమలేశ ఫోన్ ద్వారా బాధితుడు బత్తిని రవితో మాట్లాడి వివరాలు సేకరించారు. గడువు ముగిసిన మందులు ఇచ్చినట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని ఆర్ఎంవో వెల్లడించారు.

ఫార్మసీ సిబ్బంది కొరత...

జీజీహెచ్‌ను ఫార్మసీ సిబ్బంది కొరత వెంటాడుతోంది. కేవలం ఇద్దరు ఫార్మాసిస్టులతోనే నెట్టుకొస్తున్నారు. స్టాఫ్‌నర్సుల సహకారంతో పేషెంట్లకు మందులు పంపిణీ చేస్తున్నారు. కనీసం ఐదారుగురు ఫార్మాసిస్టుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కుప్పలుగా గడువు ముగిసిన మందులు!

గడువు ముగిసిన మందులను ఎప్పటికప్పుడు గుర్తించాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వాటిని భూమిలో పాతిపెట్టాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ ఫార్మసీ స్టోర్స్‌లో గడువు ముగిసిన మందులు కుప్పలుగా పడి ఉన్నాయని తెలిసింది.

టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయండి

- కొత్త కథ వినండి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: వేసవిలో పిల్లలు ఉల్లాసంగా గడిపేందుకు రూమ్ టు రీడ్ సంస్థ రోజుకో కొత్త కథ ఆడియో రూపంలో అందిస్తోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రూమ్ టు రీడ్ ఉల్లాస సమయం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా రూమ్ టు రీడ్ సంస్థ.. ఐవీఆర్ఎస్ సాయంతో ఉల్లాసవంతమైన కొత్త కథలను ఆడియో రూపంలో అందిస్తోందని తెలిపారు. నీతి కథలు, పిల్లల కథలు వింటే చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని ఆయన అన్నారు. కొత్త కథల కోసం టోల్ ఫ్రీ నంబర్ 040-4520-9722కు కాల్ చేయాలని ఆయన సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ప్రతినిధులు నరసింహాచారి, పాఠశాల అకడమిక్ అధికారి షేక్, రీడ్ టు రూమ్ సంస్థ రాష్ట్ర ప్రతినిధులు తేజస్వి, మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈతవనం దగ్ధం

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారు అంతర్గాం నూకాంబిక పోచమ్మ ఆలయ సమీపంలోని ఈతవనం మంగళవారం అగ్నికి ఆహుతైంది. గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని ఎండిన కొమ్మలకు నిప్పంటించడంతో ఈదురుగాలి ధాటికి మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో 40 ఈతచెట్లు కాలిబూడియ్యాయి. తద్వారా గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని పైడిపల్లి వెంకటస్వామి ఆవేదన చెందాడు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ స్పందించి ఆర్థిక సాయం అందించాలని గీత కార్మిక సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గీతాభవన్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రూ.2,57,870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపల్లి హవేలీకి చెందిన మామిడాల సతీశ్ నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు తగిన ఆధారాలు చూపలేదని వివరించారు.

రూ.5,42,550..

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని మోచీబజార్‌లో మంగళవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన చక్రపు శిరీష ఎలాంటి పత్రాలూ లేకుండా రూ.4.84లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా గాంధీనగర్‌కు చెందిన రమేశ్ రూ.58,550 తీసుకెళ్తుండగా పట్టుకుని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించారు.

రూ.4 లక్షలు..

మెట్‌పల్లి:పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4లక్షలను సీజ్ చేశారు. వాటిని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు.

రూ.1.10 లక్షలు..

హుజూరాబాద్‌రూరల్ : పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్ వద్ద ఉన్న చేసిన చెక్ పోస్టు వద్ద నగదు పట్టుబడినట్లు టౌన్‌సీఐ బొల్లం రమేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లవేణి సాంబయ్య వాహనంపై వెళ్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 10 వేలను పట్టుకున్నట్లు తెలిపారు. రూ.50 వేల పైన నగదు తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

దుబాయ్‌లో కొల్వాయి యువకుడి దుర్మరణం

సారంగాపూర్:బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బండ్ర రాజేశ్ దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొల్వాయికి చెందిన రాజేశ్ (28) ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం చనిపోయినట్లు ఇక్కడి బంధువులకు సమాచారం అందింది. ఎదిగిన కొడుకు దుబాయ్‌లో మృతిచెందడంతో తల్లిదండ్రులు రాజవ్వ, చంద్రయ్య కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రచారానికి మొగులు గుబులు

- నిన్నటిదాకా ఎండలు, ఇప్పుడు వానలు
- భారీ వర్షం కారణంగా రద్దయిన సీఎం సభ
- వేములవాడ ప్రధాని సభకూ వాన ముప్పు
- 11వ తేదీ వరకు ఇదే వాతావరణం ఉండే చాన్స్
- రూ.కోట్ల ధనం వృథా అయిందని నేతల ఆవేదన


కరీంనగర్‌లో గాలివానతో చెల్లాచెదురుగా పడ్డ జనజాతర సభ కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు, టెంట్లు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

పార్లమెంట్ ప్రచారంలో నిండా మునిగిన నాయకులు ప్రత్యర్థులను ప్రకృతి పగబట్టినట్లే ఉంది. నిన్నటిదాకా భానుడి భగభగలతో తల్లడిల్లిన నాయకులు సరిగా ప్రచారం చేయలేకపోగా.. ప్రస్తుతం ఆకస్మిక వానలతోనూ దాదాపుగా అదే పరిస్థితి నెలకొంది. 47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో చరిత్రలో ఇటీవలి కాలంలో అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా 2024 రికార్డులకెక్కింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవడంతో నాయకులు, కార్యకర్తలు తల్లడిల్లారు. ముఖ్యనాయకులు రోజుకు రెండు మూడు సభల్లో పాల్గొనాల్సి రావడం వల్ల చాలాచోట్ల మిట్ట మధ్యాహ్నం సభలు ఏర్పాటు చేశారు. దీంతో పలు చోట్ల సభలకు వెళ్లినవారు ఎండదెబ్బకు గురై తీవ్ర అస్వస్థత పాలయ్యారు. అదే సమయంలో ఎండల కారణంగా కార్యకర్తలు, నాయకులు పూర్తిస్థాయిలో ప్రచారం చేయలేకపోయారు. తాజాగా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. ఐఎండీ చెప్పినట్లుగా..11 వరకు భారీ వర్షాలు వెంటాడితే ప్రచారం ఎలా చేసేది? అని పార్లమెంట్‌కు పోటీ పడుతున్న అభ్యర్థులు, సీనియర్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. తాము రూ.లక్షలు ఖర్చు పెట్టి జనసమీకరణ చేసి, వారికి తాగునీరు, మజ్జిగ, భారీ టెంట్లు, వాహనాలు సమకూర్చితే.. తీరా ఎండలు, వానల కారణంగా సభలు రద్దవడం లేదా జనాలు ఆశించిన మేరకు రాకపోవడం వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తోంది.

ప్రధాని సభపై నీలినీడలు

వేములవాడలో నిర్వహించతలపెట్టిన ×వేములవాడ జనసభ¤కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇంతవరకూ ఏ ప్రధాని కూడా దక్షిణ కాశీగా పేరొందిన శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న దాఖలాలు లేవు. ఈసారి కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ ప్రత్యేక వినతి మేరకు ఆయన వేములవాడకు రానున్నారు. ఉదయం 10 గంటల సమయంలో వేములవాడ బాలామైదాన్‌లో ఏర్పాట్లను ఎంపీ సంజయ్ స్వయంగా పర్యవేక్షించారు. మంగళవారం ఆకస్మిక వర్షానికి సభ ఏర్పాట్లు చెదిరిపోయినా.. తిరిగి ఏర్పాటు చేయించారు. అయినా ఐఎండీ హెచ్చరిక నేపథ్యంలో వర్షం భయం వెంటాడుతూనే ఉంది. మరోవైపు మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన జనజాతర సభ భారీ వర్షం కారణంగా రద్దయింది. భారీ ఈదురుగాలుల నేపథ్యంలో హెలీక్యాప్టర్ ఎగిరే వీలులేక సీఎం సభ రద్దు చేశారు. అదే సమయంలో మంథనిలో రాజస్తాన్ సీఎం హాజరైన సభకూ ఈదురుగాలులు, భారీవర్షం కారణంగా అనుకున్నంత మేరకు విజయం కాకపోవడంతో పార్టీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

భారీ బందోబస్తు

ప్రధాని పర్యటన నేపథ్యంలో వేములవాడలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రధాని పర్యటించే ఆలయ పరిసరాలు, బాలమైదాన్ సభా ప్రాంగణం పూర్తిగా ప్రధాని భద్రతా దళమైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీజీ) తన ఆధీనంలోకి తీసుకుంది. స్థానిక పోలీసులతోపాటు దాదాపు 1,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని సమాచారం.

సీఎం జనజాతర సభ రద్దు

కరీంనగర్ కార్పొరేషన్: ఈదురు గాలులు.. వర్షం కారణంగా నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర బహిరంగ సభ చివరి నిమిషంలో రద్దయింది. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీఎం చేపడుతున్న ప్రచారంలో భాగంగా నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో సభ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆయన కరీంనగర్‌కు చాపర్ ద్వారా రావాల్సి ఉండగా, అకస్మాత్తుగా మధ్యాహ్నం నుంచే ఈదురుగాలులు, వర్షం కురవడంతో సీఎం రాలేకపోయారు. అప్పటికే సభాస్థలికి కాంగ్రెస్ నాయకులంతా చేరుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సభాస్థలికి ప్రయాణమయ్యారు. వర్షం కారణంగా మార్గమధ్యలోనే నిలిచిపోగా, వచ్చిన కొద్ది మంది వర్షంలోనే తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కనిపించి, పట్టపగలే చీకటికమ్ముకొంది. ఈదురుగాలులకు మైదానంలో వేసిన టెండ్లు కూలిపోయాయి. అప్పటికే అక్కడక్కడా జనం కూర్చొని ఉండగా, భయంతో పరుగుతీశారు. పోలీసు విభాగానికి చెందిన ఓ అధికారికి స్వల్పగాయాలయ్యాయి. గంటన్నర తరువాత వర్షం తగ్గుముఖం పట్టగా, సమీపంలో ఉన్న ప్రజలు చేరుకోవడం ప్రారంభించారు. దీంతో సభను కొనసాగించేందుకు ప్రయత్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అభ్యర్థి రాజేందర్‌రావు తదితరులు పలుమార్లు చర్చించారు. మరోసారి వర్షం పడడంతో సభను రద్దు చేసినట్లు వెల్లడించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలలో ఎవరో ఒకరితో కరీంనగర్‌లో మళ్లీ సభ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పేర్కొన్నారు.

మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న పరిశీలకులు అమిత్ కటారియా

కరీంనగర్ అర్బన్: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల విధులు నిర్వర్తించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఏ చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. ఈసీ మార్గదర్శకాలపై మైక్రో అబ్జర్వర్లకు అవగాహన ఉండాలన్నారు. ఉదయం మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, ఈవీఎంస్ నోడల్ అధికారి కిరణ్ ప్రకాశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ తప్పులొద్దు

- తిరస్కరణకు తావివ్వొద్దు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లనివి 1,739

గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా తిరస్కరణకు గురైన ఓట్లు

కరీంనగర్	302	వేములవాడ	125
హుజూరాబాద్	298	సిరిసిల్ల	208
చొప్పదండి	214	హుస్నాబాద్	312
మానకొండూరు	280		



కరీంనగర్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ఓటు.. విద్యావంతులైన ఉద్యోగులు వేసే ఓటు. కానీ సదరు ఉద్యోగులే తప్పులు చేస్తుంటే ఓటు చెల్లుబాటు కాకుండా పోవడం ఆందోళనకర పరిణామం. నిబంధనలు తెలియవా.. కావాలని చేస్తున్నారో కానీ సమాజంలో నవ్వులపాలవుతున్నారు. ఈ క్రమంలో ప్రతి పోస్టల్ బ్యాలెట్ చెల్లేలా సదరు ఓటర్లు జాగ్రత్తగా ఓటును వినియోగించి ఆదర్శంగా నిలవాలి మరీ. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది, సైనికులు, ఇతర అత్యవసర సేవలకు చెందినవారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందస్తుగా ఓటుహక్కు వినియోగించుకోవడం పరిపాటి. అయితే ఓటు వేసే క్రమంలో ఉద్యోగులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల తిరస్కరణకు గురవుతున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తు పత్రాలను నేరుగా సేకరించి జిల్లాలకు పంపించారు. దీంతో ఉద్యోగులు, వివిధ సర్వీసుల వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈసారి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ కోసం అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. సిబ్బంది ఫాం 12 పత్రాలను సేకరించి ఎపిక్ కార్డుతో సహా వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. సదరు ఉద్యోగి ఎక్కడ ఓటు వేయడానికి ఎంపిక చేసుకున్నారో ఆ డేటా అంతా ఆన్‌లైన్‌లో కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఓటు వేసేటప్పుడు పొరపాట్లు జరగకుండా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. డిక్లరేషన్ సమయంలో ఇబ్బందులు కలగకుండా గెజిటెడ్ అధికారులను అందుబాటులో ఉంచుతున్నారు. ఈనెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది.

ఒకరికే టిక్ చేయాలి

పోస్టల్ బ్యాలెట్ వేసేవారికి ఫాం 12 ఇస్తారు. ఇందులో 13ఏ, 13బీ, 13సీ, 13డీ కవర్లు ఉంటాయి. 13ఏ కవర్లో డిక్లరేషన్ ఫాంపై తప్పకుండా సంతకం చేయాలి. బ్యాలెట్ నంబరు, సీరియల్ నంబరు వేయాలి. 13బీ కవర్‌లో బ్యాలెట్ పేపర్ ఉంటుంది. అభ్యర్థులు, పార్టీల పేర్లు మాత్రమే ఉంటాయి. వాటి ఎదురుగా పెన్నుతో రైట్ గుర్తు పెట్టాలి. ఒకరి ఎదురుగా మాత్రమే టిక్ పెట్టాలి. ఒకరి కంటే ఎక్కువ మందికి టిక్ చేస్తే తిరస్కరణకు గురవుతుంది. ఏ అభ్యర్థికి లేదా నోటాకు టిక్ పెట్టకున్నా తిరస్కరిస్తారు. పూర్తిచేసిన 13ఏ, 13బీ కవర్లను 13సీ కవర్లో పెట్టాలి. పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రంలో ఒకే అభ్యర్థి పక్కన టిక్ లేదా ఇంటు గుర్తు పెడితే ఓటు చెల్లుబాటు అవుతుంది.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్


మాట్లాడుతున్న వెంకటేశ్

కరీంనగర్: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో 400 సీట్లు గెలిచి రాజ్యాంగాన్ని మారుస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల రిజర్వేషన్లు ఎత్తివేస్తామని బీజేపీ మంత్రులే వేదికల మీద ఉపన్యాసాలు ఇస్తున్నారని అన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని, గ్రానైట్, ఇసుక మాఫియా వద్ద వేల కోట్ల రూపాయలు ముడుపులు తీసుకొని, ఆస్తులు కూడబెట్టుకున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు సీపీఎం మద్దతు తెలుపుతోందని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం, సీపీఐలు తమకు మద్దతు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీగా బండి సంజయ్ అభివృద్ధి నిరోధకుడిగా మారాడన్నారు. సీపీఎం రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాములు, సిద్దిపేట జిల్లా నాయకుడు శివరాజ్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, వర్ద వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు ప్రత్యేక బందోబస్తు

- అడుగడుగునా తనిఖీలు
- డాగ్‌స్క్వాడ్‌లతో ఆలయ పరిసరాల పరిశీలన


ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వేములవాడ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం వేములవాడకు వస్తుండటంతో మంగళవారం జిల్లా పోలీసులతో పాటు ఎస్పీజీ, స్పెషల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. అడుగడుగునా తనిఖీలు చేస్తూ, రోడ్లన్నీ బారికేడ్లతో మూసివేసి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.

బట్టోనితాళ్లలో చోరీ

- బంగారం, వెండి ఆభరణాల అపహరణ


చిందరవందరగా వస్తువులు

ముస్తాబాద్: మండలంలోని బట్టోనితాళ్ల గల కట్ట మహేందర్ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహేందర్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో బంగ్లాపై నిద్రించారు. దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి చొరబడి బీరువలో గల మూడున్నర తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం బంగ్లాపై నుంచి కిందికి వచ్చిన మహేందర్ ఇంటి తలుపులు తెరిచి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. మిర్చి పంట అమ్మగా వచ్చిన రూ.35వేలను ఆస్పత్రిలో చికిత్స కోసం దాచుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు.

జగిత్యాలలో రెండిళ్లలో..


చిందరవందరగా బీరువాలోని సామగ్రి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు మంగళవారం తెల్లవారుజామున రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శ్రీరాంనగర్‌కు చెందిన రాగిల్ల లావణ్య తన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా, దొంగలు ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి రూ.20 వేల నగదు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే లవంగం రాజేందర్ ఇంట్లో కూడా చొరబడగా ఎలాంటి వస్తువులు పోలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

11న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్/సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళల సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి గణపతి తెలిపారు. సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో రాణించిన క్రీడాకారిణులను త్వరలో మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో సాయంత్రం 4 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్య 9849114956 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గడ్డివాములు దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శంకరపట్నం: మండలంలోని ముత్తారం, అర్కండ్ల గ్రామాల్లో మంగళవారం పది గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ముత్తారంలోని పంటపొలాల్లో కొయ్యకాళ్లకు నిప్పంటుకొని ఐదు గడ్డివాములు దగ్ధంకాగా మంటలు వ్యాపించకుండా రైతులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అర్కండ్లలో నిప్పంటుకుని ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలనార్పివేశారు.

మానేరు వాగులో మునిగి యువకుడి మృతి


రమేశ్ మృతదేహం

తిమ్మాపూర్: మానేరు వాగులో మునిగి మంగళవారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు సంబంధించిన ఫ్లెక్సీలు కట్టేందుకు హైదరాబాద్ నుంచి సోమవారం పది మంది యువకులు వచ్చారు. ఫ్లెక్సీలు కట్టిన తర్వాత మధ్యాహ్నం ఎండతీవ్రత నేపథ్యంలో ఈత కొట్టేందుకు మానేరు వాగులోకి వెళ్లారు. అందులోని సింగారం రమేశ్ (28) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

రైలుకింద పడి రేషన్ డీలర్ భర్త ఆత్మహత్య


పెర్క లింగయ్య (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన పెర్క లింగయ్య(56) మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య శారద రేషన్ డీలర్. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కూనారం రైల్వేగేటు సమీపంలో ఉన్న లింగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి విచారణ జరుపుతున్నామని రైల్వేపోలీసులు తెలిపారు. మృతుడు లింగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పొల్యూషన్ వల్లే ఆస్తమా సమస్య

- తొలి దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చు
- వరల్డ్ ఆస్తమా డేలో పల్మనాలజిస్టులు


కార్యక్రమానికి హాజరైన మెడికవర్ వైద్యులు

కరీంనగర్ టౌన్: ప్రమాదకరంగా మారుతున్న పొల్యూషన్ వల్లే ఆస్తమా సమస్య తలెత్తుతోందని కరీంనగర్ పల్మనాలజిస్టులు తెలిపారు. వరల్డ్ ఆస్తమా డేను పురస్కరించుకొని, నగరంలోని మెడికవర్ ఆస్పత్రి, కరీంనగర్ చెస్ట్ ఫిజీషియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ స్టేడియంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆస్తమా ఊపిరితిత్తులను దెబ్బతీసే దీర్ఘకాలిక వ్యాధి అన్నా రు. పొగాకు, స్మోకింగ్, చల్లని గాలి, దుమ్ము, ధూళి, మానసిక ఆందోళన మొదలైనవి ప్రధాన కారణాల ని పేర్కొన్నారు. ఆస్తమాను తొలి దశలో గుర్తిస్తే నియంత్రణ సాధ్యమేనని తెలిపారు. ప్రస్తుతం అస్తమా కు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, ప్రతి ఒక్క రూ వ్యాక్సిన్ తీసుకుంటే ఆస్తమా బారిన పడకుండా జీవించవచ్చన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా మన కరీంనగర్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పల్మనాలజిస్టులు వినయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాము, కార్డియాలజిస్టులు కిరణ్‌కుమార్, రామనాథం, క్రిటికల్ కేర్ వైద్యులు ఉపేందర్, వెంకటేశ్, అన్వేశ్, వేణుగోపాల్, నాగరాజు, కార్తీక్, దిలీప్‌రెడ్డి, ప్రసన్న, ప్రతిష్ఠ, రవిమల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్, తిరుపతి, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు. అనంతరం వ్యాయామంలో భాగమైన జుంబా డాన్స్‌పై శిక్షణనిచ్చారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


సమ్మయ్య (ఫైల్)

శంకరపట్నం(మానకొండూరు): కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు గొల్లెన సమ్మయ్య(53) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. సమ్మయ్యకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల వివాహం జరిపించి అత్తారింటికి పంపించారు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. కూతుళ్ల వివాహం, ఇంటి నిర్మాణంతోపాటు పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు అధికం అయ్యాయి. వాటిని తీర్చేదారిలేక మానసిక వేదనకు గురయ్యాడు. ఈక్రమంలో సోమవారం పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి రాజన్నసిరిసిల్ల వాసి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ తీగెల వంతెన పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటకు చెందిన గాజుపల్లి రాజనర్సు అలియాస్ ముత్యం(42)గా గుర్తించారు. కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. రాజనర్సు సెంట్రింగ్ పని చేస్తున్నాడు. 11 రోజుల క్రితం హార్వెస్టర్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమవడంతో కుటుంబసభ్యులు తొలుత ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా కరీంనగర్ వచ్చాడు. తీగెల వంతెన పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా తేల్చి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. మంగళవారం పత్రికల్లో వచ్చిన ఫొటోను చూసి, మృతుడి కుమారుడు దిలీప్ కరీంనగర్ ఆస్పత్రికి వచ్చాడు. ఆ మృతదేహం తన తండ్రి రాజనర్సుదేనని గుర్తించాడు. అప్పులు ఎక్కువై, జీవితం పై విరక్తి తో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

వీణవంక: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం పోతరాజు పోచాలు(45)అనే రైతు తనకున్న మూడెకరాల్లో మొక్కజొన్న , వరి పంట సాగు చేశాడు. పంట చివరి దశలో తడి అందక ఎండిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి రాకా రూ.4లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చలేక జీవితం పై విరక్తి చెంది ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.